సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



మైనర్లే కానీ.. మహా ముదుర్లు

పగటి పూటే వరుసగా దొంగతనాలకు పాల్పడి.. బంగారు నగలను దోచుకుంటూ భీమిలి వాసులను బెంబేలెత్తించారు. 8లో



యువకుల మృతదేహాలు లభ్యం

సముద్రంలో గల్లంతైన మూలపాలేనికి చెందిన అనిల్, ప్రవీణ్ మృతదేహాలు తెన్నేటి పార్కు సమీపంలో లభ్యమయ్యాయి. 8లో



ఉపాధి 'బంక్'లు

జీసీసీ గిరిజన జీవితాలకు భరోసా కల్పించే సంస్థగా ఎదిగింది. ఏజెన్సీ ప్రజలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తోంది. 10లో

స్లమ్స్‌కు కొత్త రూపు

మోడల్ కాలనీలుగా మురికివాడలు

- జోన్ల వారీగా అభివృద్ధికి ప్రణాళికలు
- మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కసరత్తు
- మొదటి దశలో జోన్ల వారీగా 11 కాలనీల ఎంపిక
- స్లమ్ ఫ్రీ సిటీగా విశాఖే లక్ష్యం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



మురికి వాడలు ఇలా అభివృద్ధి చెందనున్నాయి..

మురికివాడలు ఇక మోడల్ కాలనీలుగా అభివృద్ధి చెందనున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ)లో దశల వారీగా మురికివాడలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఆయా మురికివాడల్లో కల్పించాల్సిన సదుపాయాలపై అన్ని విభాగాల అధికారులు కలిసి సంయుక్తంగా జోన్ల వారీగా అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా మొదటి దశలో 8 జోన్లలో 11 మురికివాడలను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. ఇక్కడ ఏయే సౌకర్యాలు కల్పించాలి? ఇందుకయ్యే వ్యయం ఎంత అనే విషయంపై ఇప్పటికే ఆయా శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మొదటి దశలో గుర్తించిన మురికివాడలను మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దిన తర్వాత.. విడతల వారీగా మిగిలిన కాలనీలను అభివృద్ధి చేయనున్నారు.

సకల సౌకర్యాల కల్పన

వాస్తవంగా మురికివాడల్లో సరైన సదుపాయాలు లేవు. రోడ్లతో పాటు మురుగు నీటిపారుదల వ్యవస్థ, నీటి సరఫరా సదుపాయం, మూత్రశాలలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు తదితర సదుపాయాలకు దూరంగా ఉంటున్నాయి. ఈ సదుపాయాలన్నీ అక్కడకు ప్రజలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకు జోన్ల వారీగా అత్యంత వెనుకబడిన మురికవాడలను మొదటగా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం జీవీఎంసీ అధికారులు మురికివాడల్లో పర్యటించారు. పైలట్ ప్రాజెక్ట్‌గా మొదటి దశలో 8 జోన్ల పరిధిలోని 11 మురికివాడలను గుర్తించారు. వీటిలో అన్ని సదుపాయాలను కల్పించిన తర్వాత.. మిగిలిన మురికివాడలను అభివృద్ధి చేయనున్నారు. తద్వారా స్లమ్స్ ఫ్రీ సిటీగా విశాఖను తీర్చిదిద్దనున్నారు.

అన్ని శాఖల సమన్వయంతో..

మురికివాడలను మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని జీవీఎంసీ నిర్ణయించింది. పట్టణ ప్రణాళిక విభాగంతో పాటు పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, తాగునీటి సరఫరా విభాగం, ఇంజినీరింగ్ ఇలా అన్ని విభాగాల అధికారులతో సమావేశం జరిగింది. జోన్ల వారీగా ఉన్న మురికివాడలు ఎన్ని? ఆయా మురికివాడల్లో ఏయే సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ఇప్పటికే అధ్యయనం పూర్తయింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కార్యాచరణ ప్రారంభించే అవకాశం ఉంది.

జోన్ల వారీగా ఎంపిక చేసిన కాలనీలివే..

జోన్	వార్డు	కాలనీ పేరు
జోన్-1	3	తోటవీధి
జోన్-2	6	ముస్లిం పీహెచ్ కాలనీ (పీఎంపాలెం)
జోన్-3	20	పెదవాల్తేరు
జోన్-4	34	న్యూ భూపేష్ నగర్
జోన్-5	55	ధర్మానగర్
జోన్-5	40	ఏకేసీ కాలనీ-01
జోన్-6	71	కుంచుమాంబ కాలనీ
జోన్-7	82	విజయరామరాజు పేట
జోన్-8	91	ఎస్సీ కాలనీ, తోటపాలెం
జోన్-8	92	బంటా కాలనీ
జోన్-8	95	బీసీ కాలనీ, శివగాయత్రి కాలనీ

ధర్మానికి కేంద్రం భారత్



అనుగ్రహ భాషణం చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

- దేశానికి ధర్మం, సంస్కృతి ప్రధానం
- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

ఏయూక్యాంపస్: ధర్మానికి ముఖ్య కేంద్రంగా భారతదేశం నిలుస్తుందని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పౌర అభినందన సభలో ఆయన నగర ప్రజలను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. దేశానికి ధర్మం, సంస్కృతి ప్రధానమన్నారు. సమాజ హితం కోసం అధికారాలను వినియోగించాలని సూచించారు. విశాఖ నగర వైభవం పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ సదస్సులకు వేదికగా విశాఖ నిలుస్తోందన్నారు. ధర్మప్రచారంతో పేరు వస్తుందన్నారు. ఆచార్య స్థానంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందన్నారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అశాంతి, అలజడిని పారద్రోలేది ఆధ్యాత్మికతేనన్నారు. సనాతన హిందూ ధర్మపరిరక్షణకు కంచి కామకోటి పీఠం పనిచేస్తోందన్నారు. ధర్మ పరిరక్షణ, ధర్మ ప్రచారంతో స్వామీజీ వెంట నడుస్తామన్నారు. ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వామీజీ రాకతో విశాఖ నగరం పునీతమైందన్నారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఆలయం అన్ని సమాజాలకు ఆశ్రయం కల్పిస్తుందన్నారు. సంప్రదాయాల పరిరక్షకులుగా స్వామీజీ నిలుస్తున్నారన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్ సోమయాజులు మాట్లాడుతూ విశాఖ నగరాన్ని దీవించాలని కోరారు. కార్యక్రమంలో బి.వెంకటరమణ, డాక్టర్ రవిరాజు, ఆచార్య పి.సోమరాజు, ఆచార్య పి.ఎస్ అవధాని, ఎం.ఆర్.కె.రాజు, డాక్టర్ ఆర్.సాంబమూర్తి, కె.చిరంజీవి, రాష్ట్ర బార్‌కౌన్సిల్ అధ్యక్షుడు గంట రామారావు, న్యాయవాదులు కృష్ణమోహన్, జె.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్తోత్ర రత్నావళి పుస్తకాన్ని స్వామీజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

విశాఖ ప్రత్యేకతను చాటిచెబుదాం

- మన సంస్కృతి ఉట్టిపడేలా పనులు చేపట్టండి
- అధికారులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశం



ఏయూ ఇన్‌గేట్ వద్ద పనులు పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి

డాబాగార్డెన్స్: జీ–20 సదస్సుకు విచ్చేస్తున్న దేశ విదేశీ ప్రతినిధులకు విశాఖ ప్రత్యేకత, మన సంస్కృతిని చాటి చెప్పాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, ఏపీ గ్రీన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ర్యాడిసన్ బ్లూ హోటల్ నుంచి సాగర్ నగర్, జోడుగుళ్లపాలెం, సీతకొండ, పార్క్ హోటల్ జంక్షన్, ఏయూ ఇన్‌గేట్, తెలుగుతల్లి ఫ్లైఓవర్ పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీ–20 సదస్సుకు దేశ విదేశీ ప్రతినిధులు నగరానికి విచ్చేస్తున్నందున.. వివిధ ఆకృతులతో కూడిన బొమ్మలు, అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, పెయింటింగ్‌లు, వివిధ ఆకృతులతో కూడిన మొక్కలు, పరిశుభ్రంగా రోడ్లు, ఫుట్‌పాత్ తదితర పనులు చేపట్టాలన్నారు. నగర అందాలు అబ్బురపరిచేలా మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఆర్.కె.బీచ్, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాల్లో చేపడుతున్న పనుల గురించి జీవీఎంసీ కమిషనర్ వివరించగా.. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ ప్రదేశాల్లో పచ్చదనం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని ఏపీ గ్రీన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డికి సూచించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళికా అధికారి సురేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు, డీసీపీ సంజీవ్‌రత్నకుమార్ పాల్గొన్నారు.

మన ఐక్యతకు కారణం సంస్కృతే..

- గుండెల నిండా తెలుగు నిండి ఉండాలి
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: భారతీయుల్లో ఎన్నో వైవిధ్యతలున్నా.. వారిని ఐక్యం చేస్తోందని మన సంస్కృతే అని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టీఎల్‌ఎన్ సభా మందిరంలో ఏయూ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం–తెలుగు ప్రాశస్త్యం'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన గుండెల నిండా తెలుగు నిండి ఉండాలని సూచించారు. భాషకు మరింత మాధుర్యాన్ని జోడించే దిశగా యువత పనిచేయాలన్నారు. భవిష్యత్ తరానికి భాషను అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఏయూ కళలకు నిలయమన్నారు. భాషాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సమైక్య భారతి జాతీయ గౌరవ అధ్యక్షుడు మూర్తి రేమెళ్ల మాట్లాడుతూ భాషకు అంతర్జాతీయ వేదికలు కావాలన్నారు. పరిశోధకులకు చోదకశక్తిగా ఈ సదస్సు నిలుస్తుందన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ జీవనదిగా మాతృభాష నిలుస్తుందన్నారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడు శలాక రఘునాథ శర్మ తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ పరభాషల అవసరాన్ని తెలిపారు. నూతన పదాలను తయారు చేసుకునే వెసులుబాటు తెలుగు భాషకే సాధ్యమన్నారు. పారిస్ నుంచి వచ్చిన తెలుగు భాషాభిమాని డేనియల్ నేజర్స్ దేవ దేవ మహాదేవ శ్లోకంతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలుగు ఉచ్చారణ చాలా గొప్పగా, అందంగా ఉంటుందన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య కె.శ్రీనివాస సాలూరు వాసూరావు, డాక్టర్ కె.రత్నశేఖర్, డాక్టర్ బూసి వెంకట స్వామి, డాక్టర్ ఎ.సీతారత్నం, విభాగ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు. సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ఆవిష్కరించి.. అతిథులను సత్కరించారు.

సింహాచలం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో పలు విభాగాలకు సంబంధించి అధికారులు, సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో వి.త్రినాథరావు ఉత్తర్వులు జారీ చేశారు. శానిటేషన్ విభాగంగా ఉన్న ఏఈవో ఎన్.ఆనందకుమార్‌ను ఆలయ ఏఈవోగా నియమించారు. ఆలయ ఏఈవోగా ఉన్న నరసింహరాజును ప్రసాదాలు, అన్నదాన విభాగం ఏఈవోగా బదిలీ చేశారు. లీజెస్ సెక్షన్, గోశాల సూపరింటెండెంట్ జి.అప్పలనాయుడును ఆలయ ఫైల్స్ కరస్పాండెన్స్, సింహగిరిపై క్యాష్ కౌంటర్ల పర్యవేక్షకుడిగా నియమించారు. ఆలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పిల్లా శ్రీనివాసరావు లీజెస్ సెక్షన్, గోశాల పర్యవేక్షకుడిగా బదిలీ చేశారు. గోశాల, నేచురోపతి ఆస్పత్రి సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.సూర్యనారాయణను సీ8, సీ9 సెక్షన్లకు సీనియర్ అసిస్టెంట్‌గా, అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్ పల్లి సూరిబాబును గోశాల, నేచురోపతి ఆస్పత్రికి సీనియర్ అసిస్టెంట్‌గా విధులు కేటాయించారు. ఆలయ నైట్ డ్యూటీలో మాలీగా పనిచేస్తున్న కర్రి సత్యారావును ల్యాండ్ ప్రొటెక్షన్‌కు, ల్యాండ్ ప్రొటెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బోర శివారెడ్డిని విజయనగరంలోని ఎస్‌బీ హౌస్‌కు బదిలీ చేశారు.

నేడు సీతంరాజు సుధాకర్ నామినేషన్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్పొరేటర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ ముఖ్యనాయకులు, శ్రేణులతో కలిసి సంపత్‌వినాయగర్ టెంపుల్‌లో ముందుగా పూజలు నిర్వహించి.. అక్కడి నుంచి భారీ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకొని నామినేషన్ వేస్తారు. టీడీపీ మద్దతు అభ్యర్థి చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్ కూడా బుధవారం నామినేషన్లు వేయనున్నట్లు ఆయా పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్ల శ్రీరాములు కూడా నామినేషన్ దాఖలు చేయనున్నారు. 23తో గడువు ముగియనుండటంతో మరికొందరు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేయనున్నారు. మంగళవారం కంచరపాలెంకు చెందిన బొడ్డేడ పద్మావతి, ఎంవీపీ కాలనీకి చెందిన కుందేటి సూర్య వెంకట సుభాష్ చంద్ర, శ్రీకాకుళం జిల్లా పొందూరుకి చెందిన ఎస్‌వీజే ప్రతాప్‌కుమార్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

30 ఏళ్ల కల.. నెరవేరిన వేళ..

- జీవో 71తో గాజువాక హౌస్ కమిటీ సమస్యకు మోక్షం
- వైఎస్సార్ సీపీ నాయకుల సంబరాలు
- సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ నాయకులు

గాజువాక: గాజువాకలో మూడు దశాబ్దాలుగా నలుగుతున్న హౌస్ కమిటీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి జీవో 71 విడుదలైంది. ఫలితంగా గాజువాక సర్వే నంబర్లు 86, 87, 274లలోని భూ వివాదానికి తెర పడే అవకాశం లభించింది. ప్రస్తుతం గాజువాకలోని 65, 66, 67, 70 వార్డుల పరిధిలో గల 545 ఎకరాల భూముల్లోని వేల సంఖ్యలో నివాసాలు ఈ సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. హౌస్ కమిటీ ఆంక్షల వల్ల ఈ ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేని పరిస్థితి చోటుచేసుకుంది. ధైర్యంగా ఒక ఇంటి నిర్మాణం కూడా చేసుకోలేని దుస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. గతంలో జీవో నంబర్లు 7, 44, 301, 279 వచ్చినా ఎవరికీ సాంత్వన లభించలేదు. ఒక జీవో ప్రకారం జారీ అయిన పట్టాలను ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం రద్దు చేయడం, కొత్త జీవోతో మళ్లీ పట్టాలను జారీ చేయడమే పనిగా సమయాన్ని గడిపేశాయి.

వైఎస్ హయాంలో..

2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బాధితుల గోడు విన్నారు. ఈ భూములను క్రమబద్ధీకరించి భూ బాధితులను ఆదుకుంటామని స్పష్టం చేశారు. అందులో భాగంగా జీవో నంబర్ 44ను జారీ చేసి హౌస్ కమిటీ భూముల క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. పోరంబోకు భూములుగా నిర్ణయించిన 545 ఎకరాల్లో 2004 మంది స్థలాలను క్రమబద్ధీకరించారు. వారిలో 100 గజాలలోపు ఉన్నవారికి ఉచితంగా క్రమబద్ధీకరణ పట్టాలను అందజేశారు. 355 ఎకరాల్లో భూముల క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టాలని జీవోలో పేర్కొన్నారు. ఆయన మరణం తరువాత ఆ జీవో అమలు ఆగిపోయింది. ఆ తరువాత అధికారం చేపట్టిన ముఖ్యమంత్రులు ఈ విషయంపై స్పందించకపోవడంతో సమస్య యధాతథంగా మిగిలిపోయింది.

షరతులతో చంద్రబాబు పట్టాలు

2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఇచ్చిన పట్టాలను రద్దు చేయడంతోపాటు హౌస్ కమిటీ బాధితులకు షరతులతో కూడిన పట్టాలను ఇచ్చారు. జీవో నంబర్ 301, ఆ తరువాత తీసుకొచ్చిన 279 జీవోల ద్వారా 6,387 మందికి షరతులతో కూడిన పట్టాలను అందజేశారు. లబ్ధిదారులకు ఆ పట్టాలు ఏ రకంగాను ఉపయోగపడలేదు. తమ అవసరాలకు ఆస్తిని అమ్ముకోవడానికి గాని, వారసులకు బదిలీ చేసుకోవడానికి గాని అవకాశం లేకుండా పోయింది.

తాజా జీవోతో శాశ్వత పరిష్కారం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జీవో 71తో హౌస్ కమిటీ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. 301 జీవో ప్రకారం పట్టాలు పొందినవారికి నామమాత్రపు రుసుంతో ఇళ్ల రిజిస్ట్రేషన్లకు కొత్త జీవోలో మార్గం సుగమం చేశారు. దీనికోసం ప్రభుత్వం ఈనెల 16న జీవో నంబర్ 60ని తీసుకొచ్చి 301 జీవోకు మార్పులు చేశారు. ఇంకా మిగిలిపోయిన 3వేల పైచిలుకు మంది జీవో నంబర్ 225 ద్వారా ప్రయోజనం పొందుతారు. ఈ జీవోను ప్రస్తుత ప్రభుత్వం 2021 ఆగస్టులో జారీ చేసింది.

గాజువాకలో సంబరాలు

గాజువాక హౌస్ కమిటీ సమస్యపై ప్రభుత్వం జీవో నెంబర్ 71ని విడుదల చేయడంతో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. 65వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బీసీ రోడ్ కాకతీయ జంక్షన్‌లో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నాం

హౌస్ కమిటీ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట ఇస్తే నెరవేర్చుతారు. హౌస్ కమిటీ సమస్యను పరిష్కరిస్తామని మాట ఇచ్చి నెరవేర్చారు. హౌస్ కమిటీ సమస్య పరిష్కారంలో ఎటువంటి రాజకీయాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా ఆలోచించాం కాబట్టే ప్రజలకు అనుకూలమైన జీవో తీసుకొచ్చాం.

– తిప్పల నాగిరెడ్డి, గాజువాక ఎమ్మెల్యే

త్వరలోనే మార్గదర్శకాలు

హౌస్ కమిటీ సమస్య పరిష్కారంపై జీవో నంబర్ 71ని ప్రభుత్వం జారీ చేసింది. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి మార్గదర్శకాలు కూడా వస్తాయి. ఆ తరువాత క్రమబద్ధీకరణ చర్యలను మొదలుపెడతాం.

– కె.త్రినాథరావు, గాజువాక ఇన్‌చార్జి తహసీల్దార్

సిబ్బంది సమస్యలు తెలుసుకున్న సీపీ

దొండపర్తి: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సమస్యలను తెలుసుకొనేందుకు సీపీ సిహెచ్.శ్రీకాంత్ గ్రీవెన్స్ నిర్వహించారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బంది వినతులను సీపీ స్వయంగా స్వీకరించారు. ఇందులో 9 మంది సిబ్బంది సమస్యలు, విజ్ఞాపనలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో డిప్యుటేషన్‌కు అనుమతి ఇవ్వాలని, ఆరోగ్య సమస్యలు దృష్ట్యా ఒక విభాగం నుంచి మరో విభాగానికి మార్చాలని, పిల్లల ఆరోగ్యం బాగోలేనందున వారి సంరక్షణ దృష్ట్యా వేరే స్టేషన్‌కు బదిలీ చేయాలని, ఇంక్రిమెంట్లు పడడంలో జాప్యం వంటి వినతులు చేశారు. వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

న్యూస్‌రీల్

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన ప్రపంచ బ్యాంక్ బృందం



స్మార్ట్‌సిటీస్ పనుల పురోగతిని కమిషనర్‌ను అడిగి తెలుసుకుంటున్న ప్రపంచ బ్యాంకు బృందం

డాబాగార్డెన్స్: విశాఖ విచ్చేసిన ప్రపంచ బ్యాంక్ బృందం (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు) మంగళవారం జీవీఎంసీ కమిషనర్ రాజాబాబును కలిసింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో భేటీ అయిన బృంద సభ్యులు జీవీఎంసీ, స్మార్ట్‌సిటీస్ ప్రాజెక్టుల్లో భాగంగా చేపడుతున్న పనులు, వాటి ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. నగరంలో పార్కులు, స్కూల్స్, సోలార్ విద్యుత్ ప్రాజెక్టు, రోడ్లు, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం వంటి పనుల పురోగతి, వాటి ఆర్థిక పరిస్థితిని బృందం సభ్యులకు కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు బృంద సభ్యులు విజయ్, నీరజ్, మోతీ, అభిషేక్, జీవీఎంసీ నుంచి స్మార్ట్‌సిటీస్ మేనేజర్ ఆనంద్, సీఏ సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఎల్‌డీ గ్యాస్ హోల్డర్–2 ప్రారంభం



గ్యాస్ హోల్డర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మరమ్మతులు చేసిన ఎల్‌డీ గ్యాస్ హోల్డర్–2 ను డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ మంగళవారం ప్రారంభించారు. స్టీల్ మెల్ట్ షాప్‌ల ఎల్‌డీ కన్వర్టర్ల నుంచి బ్లోయింగ్ సమయంలో ఉత్పత్తి చేసే గ్యాస్‌ను నిర్వహించడానికి రెండు గ్యాస్ హోల్డర్లు ఏర్పాటు చేశారు. ఈ ఎల్‌డీ గ్యాస్ హోల్డర్‌లో ఉండే గ్యాస్ ఆరు రోలింగ్ మిల్లుల్లోని ఫర్నేస్‌ల ఇంధన అవసరాన్ని తీరుస్తుంది. అదే విధంగా టీపీపీ విభాగంలోని బాయిలర్లలోనూ ఉపయోగించబడుతుంది. రూ. 20 కోట్లతో చేపట్టిన మరమ్మతుల అనంతరం ప్రారంభోత్సవం నిర్వహించారు. గ్యాస్ హోల్డర్‌ను తిరిగి ప్రారంభించడంలో ముఖ్య పాత్ర వహించిన ఉక్కు సిబ్బందిని డైరెక్టర్ బాగ్చీ అభినందించారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) డి.కె. మహంతి, సీజీఎం (ప్రాజెక్ట్స్) ఇన్‌చార్జ్ బాపారావు పాల్గొన్నారు.


25న దుబాయ్‌లో శత వసంత కళా వైభవం



వివరాలు వెల్లడిస్తున్న ఆచార్య లక్ష్మీ ప్రసాద్

ఏయూ క్యాంపస్: కేంద్ర సాంస్కృతిక శాఖ, తెలంగాణ పర్యాటక కార్పొరేషన్, దుబాయ్ తెలంగాణ సొసైటీ సహకారంతో ఈ నెల 25న దుబాయ్‌లో మహానటుడు ఎన్టీఆర్, అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుల శత జయంతి కళా వైభవం ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. మంగళవారం ఏయూ హిందీ విభాగంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ, కళయిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు ఎన్టీఆర్ అంతర్జాతీయ పురస్కారాన్ని, స్వాతి పత్రిక సంపాదకుడు వేమూరి బలరామ్‌కు ఎన్టీఆర్–ఘంటసాల అంతర్జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. ఘంటసాల కోడలు, భరతనాట్య కళాకారిణి ఘంటసాల పార్వతి, ప్రముఖ గాయకుడు చంద్రతేజలకు ఘంటశాల అంతర్జాతీయ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. మహా నాయకుడు ఎన్టీఆర్, మన ఘంటసాల పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.

డీటీసీ రాజారత్నంకు డాక్టరేట్



గోపాలపట్నం: ఉప రవాణా కమిషనర్ రాజారత్నంకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. వర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ ప్రొఫెసర్ జి.సత్యనారాయణ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాలపై ఆయన పరిశోధన చేశారు. ఏటా 5 లక్షలకు పైగా జరుగుతున్న రహదారి ప్రమాదాల్లో 1.50 లక్షల మందికి పైగా వాహనచోదకులు మరణిస్తున్నారని ఆయన తెలిపారు. రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

పార్టీ కోసం కష్టపడితే మంచి భవిష్యత్

- మత్స్యకారులంతా సీఎం జగన్ వెంటే..
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకార వర్గానికి చెందిన ముగ్గురికి ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అవకాశం కల్పించి.. మత్స్యకార కులానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉంటామని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు అన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. '2014 ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు అవకాశం కల్పించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సామాజిక సమీకరణాల కారణంగా నాకు టికెట్ రాలేదు. కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయి గురువులన్నా.. మన ప్రభుత్వం వస్తే ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తా అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు.' అని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని, పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పిస్తారని.. అందుకు ఉదాహరణ తానేనని భావోద్వేగానికి గురయ్యారు. మొత్తం 18 మందిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటిస్తే.. వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 14 మందికి అవకాశం కల్పించి సామాజిక న్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా మత్స్యకారులంతా ఆలోచన చేసి.. మన కులాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే రానున్న ఎన్నికల్లో ఓటు వేసి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లంపల్లి రాజుబాబు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయ్‌చందర్ పాల్గొన్నారు.

మైనర్లే కానీ.. మహా ముదుర్లు

- భీమిలిలో పగటి పూటే 8 ఇళ్లల్లో చోరీలు
- విలాసవంతమైన జీవనం కోసం దొంగతనాలు
- ఎట్టకేలకు వారిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వారి నుంచి 355 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం
- గాజువాకలో సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్
- 39 మొబైల్స్, రూ.2 లక్షలు నగదు, ఇతర సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ(క్రైం) జి.నాగన్న


స్వాధీనం చేసుకున్న మొబైల్స్‌ను చూపిస్తున్న డీసీపీ(క్రైం) జి.నాగన్న

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీరు మైనర్లు.. కానీ మహా ముదుర్లు. పోలీసులకే కంటి మీద కునుకు లేకుండా చేశారు. చిన్న వయసులోనే చోర కళలో ఆరితేరిపోయారు. రెక్కీ నిర్వహించి మరీ తాళాలు వేసి ఉన్న, ప్రధానంగా దివీస్ ఫార్మా ఉద్యోగుల ఇళ్లనే టార్గెట్ చేసుకున్నారు. పగటి పూటే వరుసగా దొంగతనాలకు పాల్పడుతూ ఇళ్లలో బంగారు నగలను దోచుకుంటూ భీమిలివాసులను బెంబేలెత్తించారు. ఇటీవల జరిగిన ఒక దొంగతనం కేసులో పోలీసులు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం తెలుసుకొని పోలీసులు సైతం విస్తుపోయారు. ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ తమకు సవాల్ విసిరింది ఆ ముగ్గురు మైనర్ స్నేహితులేనని నిర్ధారణకు వచ్చి నిర్ఘాంతపోయారు. విలాసవంతమైన జీవితం గడిపేందుకు ఈ మైనర్లు దొంగలుగా మారినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆ ముగ్గురితో పాటు వారికి సహకరించిన మరో ఐదుగురిని కూడా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 355 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు గాజువాక ప్రాంతంలో హాస్టల్స్, బ్యాచిలర్ రూములే లక్ష్యంగా చేసుకొని వారు పడుకున్న సమయంలో మొబైల్స్, ల్యాప్‌టాప్స్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను చోరీ చేస్తున్న వ్యక్తిని గాజువాక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుల వివరాలను మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న వెల్లడించారు.

2.5 తులాల కేసులో చిక్కి.. 30 తులాలు కక్కి..

భీమిలిలో చిన్నబజార్ జంక్షన్‌లో కలిదిండి నోహార్ తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. అతడు దివీస్‌లో ఉద్యోగం చేస్తుండగా.. అతడి భార్య ఒక స్కూల్లో పనిచేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన నోహార్ ఆఫీస్‌కు వెళ్లగా.. అతని భార్య ఇంటికి గడియ పెట్టి తాళం వేయకుండా స్కూల్‌కు వెళ్లిపోయింది. వారు సాయంత్రం 4.30 గంటలకు ఇంటికి తిరిగివచ్చి చూడగా ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో లోని 2.5 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో నోహార్ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డీసీపీ(క్రైం) జి.నాగన్న పర్యవేక్షణతో ఏడీసీపీ, నార్త్ సబ్ డివిజన్ సీఐ, ఎస్ఐలు ఈ వరుస చోరీలపై దృష్టి పెట్టారు. నోహార్ కేసు విషయంలో లభించిన ఆధారాలతో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించగా.. వారే 8 ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు.

విలాసవంతమైన జీవితం కోసం దొంగలుగా..

విలాసవంతంగా జీవితాన్ని గడిపేందుకు భీమిలికి చెందిన ముగ్గురు మైనర్లు దొంగలుగా మారారు. భీమిలి మండలం సంగివలసకు చెందిన మరో స్నేహితుడు ఇంటి గణేష్(23) ముగ్గురు మేనర్లను దొంగతనాలు చేసేందుకు ప్రేరేపించాడు. ఇలా వీరు పగటి పూటే రెక్కీ నిర్వహించి ప్రధానంగా దివీస్ ఫార్మా ఉద్యోగుల ఇళ్లను లక్ష్యంగా చేసుకొని వారు ఉద్యోగాలకు వెళ్లిన తరువాత తాళాలు పగలగొట్టి 8 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను భీమిలికి చెందిన ఇంటి గణేష్, రిక్కా రామలక్ష్మి, కనకాల లక్ష్మణ్(, శరగడ శశిధర్, బాలు(ప్రస్తుతం జైలులో ఉన్నాడు)లకు అందజేస్తే వారు వాటిని విక్రయిస్తూ డబ్బు చేసుకొనేవారు. ఈ విషయాలన్నింటినీ తెలుసుకున్న పోలీసులు ముగ్గురు మైనర్లతో పాటు వారికి సహకరించిన ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 355 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును చేధించిన ఏడీసీపీ డి.సూర్యశ్రవణ్ కుమార్, నార్త్ సబ్ డివిజన్(క్రైం) సీఐ డి.రమేష్, భీమిలి(క్రైం) ఎస్ఐ ఎస్.సూర్యప్రకాషరావు, పీఎంపాలెం (క్రైం) ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు, ఆనందపురం(క్రైం) ఎస్ఐ ఎ.మన్మధరావు, ఏఎస్ఐ కె.బి.గోవిందరాజు, కానిస్టేబుల్ ఎ.సతీష్‌భరత్, పద్మనాభం పీసీ కె.సతీష్, భీమిలి హెచ్‌సీ ఎ.దామోదర్‌లను డీసీపీ(క్రైం) జి.నాగన్న అభినందించారు.

హాస్టల్స్ లక్ష్యంగా సెల్‌ఫోన్లు చోరీ

హాస్టల్స్, బ్యాచిలర్ రూములే లక్ష్యంగా చేసుకొని వారు నిద్రపోతున్న సమయంలో మొబైల్స్, ల్యాప్‌టాప్స్ ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను చోరీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బూర్లు జ్యోతేష్(24) పోటీ పరీక్షలకు చదువుకునేందుకు గాజువాక చైతన్యనగర్ ప్రాంతంలో ఉన్న సత్య బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. జనవరి 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు అతని మొబైల్ ఫోన్‌ను తలగడ కింద పెట్టుకొని పడుకున్నాడు. ఉదయం లేచి చూసుకోగా తన ఫోన్ కనిపించలేదు. దీంతో హాస్టల్‌లో మిగిలిన వారిని అడగ్గా మరో 12 మంది తమ ఫోన్లు కూడా పోయినట్లు చెప్పారు. వారు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ఎస్ఐ మహేశ్వరరావుకు వచ్చిన విశ్వసనీయమైన సమాచారం మేరకు విజయనగరం జిల్లా గుర్లకు చెందిన కనకం దామోదరరావును పాత గాజువాక బస్ స్టాప్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించారు.

దామోదరరావుపై 15 దొంగతనం కేసులు

దామోదరరావు పాత నేరస్తుడుగా పోలీసులు గుర్తించారు. అతడిపై ఇప్పటివరకు 15 దొంగతనం కేసులు ఉన్నాయి. ఇతడు ఎక్కువగా హాస్టల్స్, బ్యాచిలర్ రూమ్‌లకు అర్ధరాత్రి వెళ్లి నిద్రపోతున్న వారి సెల్‌ఫోన్లు చోరీ చేస్తూ వస్తున్నాడు. తరువాత వాటిని అన్‌లాక్ చేసి ఆ ఫోన్లలోనే ఓఎల్‌ఎక్స్ ఇన్‌స్టాల్ చేసి అందులోనే వాటిని అమ్మకాలకు పెడుతున్నాడు. ఫేక్ బిల్లులు వారికి చూపిస్తూ కొన్ని మొబైల్స్‌ను విక్రయించాడు. ఇంకా అమ్మకానికి పెట్టిన 39 ఆండ్రాయిడ్ ఫోన్స్‌తో పాటు రూ.2 లక్షలు నగదు, ల్యాప్‌టాప్, రెండు రిస్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మొత్తంగా రూ.8 లక్షలు విలువ చేసే వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సౌత్ సబ్ డివిజన్(క్రైం) సీఐ పి.సూర్యనారాయణ, సీసీఎస్ సీఐలు ఎస్.రమేష్, ఆర్.సత్యనారాయణ, గాజువాక ఎస్ఐ ఇ.మహేశ్వరరావు, సీసీఎస్ ఎస్ఐ పి.వి.రమణారెడ్డి, టెక్‌సెల్ ఎస్ఐ ఆర్.సోమేశ్వరరావు, సీసీఎస్ ఏఎస్ఐలు డి.శ్రీనివాసరాజు, టి.చంద్రశేఖర్, పీసీలు ఎస్.సోమశేఖర్, డి.వి.ఎస్.కుమార్ ఛేదించారు.

యువకుల మృతదేహాలు లభ్యం

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు


అనిల్, ప్రవీణ్‌కుమార్ మృతదేహాలు

ఎంవీపీకాలనీ: మహా శివరాత్రి రోజున సముద్రంలో గల్లంతైన అప్పుఘర్ మూలపాలేనికి చెందిన ఉమ్మిడి అనిల్(23), మరుపల్లి ప్రవీణ్ కుమార్(22) మృతదేహాలు తెన్నేటిపార్కు సమీపంలో లభ్యమయ్యాయి. ఈ అనూహ్య ఘటనతో ఇరు కుటుంబాల్లో విషాదచాయలు నెలకొనగా మూలపాలెం గ్రామస్తులు ఆవేదనకు గురయ్యాయి. యువకులు గల్లంతైన రోజే రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం గజఈతగాళ్లు, కోస్ట్ గార్డ్, నాటు బోట్ల సాయంతో విస్తృతంగా గాలింపు చర్యలు ప్రారంభించింది.. మంగళవారం కూడా బీచ్ కమ్యూనిటీ గార్డ్‌లతో పాటు నాటు పడవల్లో మత్స్యకారులు యువకుల ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించారు. క్యూబా డైవర్స్‌ను సైతం రంగంలోకి దించి తీరంలో అడుగున గాలింపు చేపట్టారు. సాయంత్రం 3.30 గంటల సమయంలో తెన్నేటి పార్కు సమీపంలోని సముద్ర తీరంలో అలలపై తేలియాడుతున్న యువకుల మృతదేహాలను మత్స్యకారులు గుర్తించారు. మిగిలిన వారికి సమాచారం ఇచ్చారు. దీంతో మరికొందరు అక్కడకు చేరుకుని బోట్లలో వాసవానిపాలెం తీరానికి మృతదేహాలను తీసుకొచ్చారు. అనిల్, ప్రవీణ్ ఇక లేరన్న విషయం తెలియడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రోదనల మధ్య వారి మృతదేహాలను ఎంవీపీ పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రమేష్‌బాబు, అక్కరమాని విజయనిర్మల

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

యువకుల కోసం జరుగుతున్న గాలింపు చర్యలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పర్యవేక్షించారు. మంగళవారం వాసవానిపాలెం తీరానికి వచ్చిన ఆయన అనీల్, ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, 18వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, 19వ వార్డు పార్టీ ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, పుక్కళ్ల శంకర్ తదితరులు గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

కొమ్మాది: రుషికొండ బీచ్‌కు ఓ యువకుడి మృతదేహం కొట్టుకొచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఇక్కడి బోటు షికారు నిర్వహించే ప్రాంతంలో రాళ్ల మధ్య మంగళవారం ఉదయం ఓ యువకుడి మృతదేహాన్ని పర్యాటకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు పోలీసులు చేరుకుని మధురవాడ మారికవలసకు చెందిన ఎస్.యోగేష్ (22)గా గుర్తించారు. యోగేష్ మధురవాడలోని ఓ కళాశాలలో బి.టెక్ పూర్తి చేశాడు. తండ్రి ఉమా మహేశ్వరరావు ఒడిశాలో స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్నారు. యోగేష్ సోమవారం కుటుంబ సభ్యులతో గొడవ పడి.. బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు రుషికొండ బీచ్‌లో మృతదేహమై కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఫిర్యాదు చేసే లోపే..

సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయిన యోగేష్ సాయంత్రం అయినా రాకపోవడంతో కొమ్మాది, మధురవాడ, పీఎంపాలెం ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు గాలించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈలోపు యోగేష్ మరణవార్త వారిని కలచివేసింది. ఇదిలా ఉండగా యోగేష్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక హత్య అనే కోణంలో ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.


తీరానికి కొట్టుకొచ్చిన యువకుడి మృతదేహం (ఇన్‌సెట్) యోగేష్ (ఫైల్)

మళ్లీ తెరపైకి చింతపల్లి ట్రెజరీ కుంభకోణం కేసు

విచారణ చేపట్టిన డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల పేరిట దొంగ బిల్లులు పెట్టి నిధులు కాజేసిన చింతపల్లి ట్రెజరీ కుంభకోణం కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శేషా రెడ్డి శాఖాపరమైన విచారణ చేపడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల పేరిట 2013 నవంబర్‌లో దొంగ బిల్లులు పెట్టి సుమారు రూ.13కోట్లు స్వాహా చేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పెట్టిన బిల్లులను ట్రెజరీ అధికారులు ఆమోద ముద్ర వేసి మొత్తం నిధులను దోచుకున్నారు. ఈ వ్యవహారం 2015లో వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో రెండు శాఖలతోపాటు ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతర అధికారులు మొత్తం 83 మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో కొంత మందిపై వేటు వేశారు. మరికొందరు రిటైర్ అయ్యారు. ఇంకొందరు మళ్లీ పోస్టింగులు తెచ్చుకున్నారు. ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు మరణించారు. అయితే రికవరీ ఏ మాత్రం జరగలేదు. సుదీర్ఘ విరామం తర్వాత వైద్య ఆరోగ్యశాఖ మళ్లీ ఈ కేసు విచారణ ప్రారంభించింది. డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి అప్పటి డీఎంహెచ్‌వో శ్యామల, పాడేరు అడిషనల్ డీఎంహెచ్‌వో స్వప్నకుమారి, డాక్టర్ మురళీమోహన్‌రావు, విశ్రాంత ఏవో శ్రీనివాస్, సిబ్బంది నిర్మల తదితరులను విచారించారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. మరో రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

సుందరీకరణ పనుల్లో రాజీపడేదే లేదు

జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు


నోవాటెల్ బీచ్ పార్కులో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: వచ్చే నెలలో నిర్వహించనున్న రెండు అంతర్జాతీయ సదస్సుల్లో భాగంగా చేపడుతున్న సుందరీకరణ పనుల్లో రాజీపడేదే లేదని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం సిరిపురం ద్రోణంరాజు సర్కిల్, గవర్నర్ బంగ్లా, గ్రీన్‌పార్క్, నౌరోజీరోడ్డు, కలెక్టర్ ఆఫీస్, నోవాటెల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సుందరీకరణ పనుల్లో రాజీ లేకుండా పని చేయాలని, మార్చి నెలలో జరిగే సదస్సులకు వచ్చే అతిథులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగర సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డుకిరువైపులా ఆకర్షణీయంగా మొక్కలు, పచ్చదనం పెంపొందించాలని మొక్కల విభాగం అధికారులను ఆదేశించారు. వినియోగంలో లేని ఎలక్ట్రికల్ పోల్స్, గ్రీన్‌పార్క్ ఎదురుగా ఎలక్ట్రికల్ కార్యాలయం ప్రహరీ వద్ద ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్‌ను ఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి వెంటనే తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మీడియం పోల్స్‌కు ఉన్న కేబుల్ వైర్లను, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని, చూసేందుకు ఆకర్షణీయంగా కనిపించే విధంగా వీఐపీ రోడ్డు తీర్చిదిద్దాలని, రోడ్లపై జీబ్రా లైన్లు, సైడ్‌లైను వేయాలని, ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 29వ వార్డు పరిధిలో పారిశుద్ధ్య పనులు సరిగ్గా నిర్వహించనందున ఆ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేయాలని అదనపు కమిషనర్ వి.సన్యాసిరావును ఆదేశించారు. అనంతరం నోవాటెల్ బీచ్‌రోడ్డు వద్ద ఉన్న వాహనాల పార్కింగ్ ప్రాంతంలోనూ, పార్కులో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులు పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పర్యటనలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజనీరు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీనివాస్, రమణ, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎస్.కిశోర్, ఏసీపీలు వేంకటేశ్వరరావు, వినయ్‌ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సత్యనారాయణ, ప్రజారోగ్యపు అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ప్రథమ చికిత్సపై అవగాహన

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇండస్ హాస్పిటల్‌లో నగర పోలీస్ సిబ్బందికి మంగళవారం ప్రథమ చికిత్సపై అవగాహన తరగతులు నిర్వహించారు. ట్రాఫిక్, బీచ్ సాండ్ బందోబస్తు, ఇతర విధులు నిర్వర్తించే 50 మంది సిబ్బందికి.. రోడ్డు ప్రమాదాలు బారిన పడిన వారికి, సముద్రంలో గల్లంతైన వారికి, ఇతర అత్యవసర సమయాల్లో బాధితులకు వెంటనే అందించాల్సిన ప్రథమ చికిత్స విధానాన్ని, మెళకువలను నిపుణులైన వైద్యులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీపీ-1 సుమిత్ సునీల్ గరుడ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి.మధు, ఆపరేషన్స్ జీఎం వై.సుధీర్‌కుమార్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, ఇంటెన్సిస్ స్పెషలిస్ట్ డాక్టర్ కె.తపతి, క్వాలిటీ మేనేజర్ సి.హెచ్.వెంకటేష్, ఐసీఎస్ బి.తెరిషా పాల్గొన్నారు.

అలరించిన సంగీత నృత్య ప్రదర్శన


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

బీచ్‌రోడ్డు: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆంధ్ర విశ్వ కళాపరిషత్, సమైక్య భారతి సంయుక్తంగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు చేసిన సంగీత నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ సంగీత కళాకారుడు సాలూరి రాజేశ్వరరావు బృందంచే ప్రదర్శించిన కళాకృతులు ఆహూతులను కట్టిపడేశాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రారంభించి మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేది మాతృ భాష మాత్రమే అని అన్నారు. భవిష్యత్ తరానికి భాషను అందించే బాధ్యత నేటి యువతపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏయూ తెలుగు విభాగాధిపతి జర్రా అప్పారావు, ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

రిటైరయ్యాక డీజీపీని ఎవరు కాపాడతారు?

టీడీపీ నేత బండారు

మహారాణిపేట: ఉద్యోగ విరమణ పొందిన తరువాత ఇంట్లో ఉండే డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని ఎవరైనా కొడితే.. కాపాడాల్సింది చంద్రబాబేనని గుర్తించాలని టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి వ్యాఖ్యానించారు. మంగళవారం విశాఖలో టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గన్నవరం ఘటనతో ఆంధ్రా ప్రజానీకం అభద్రతా భావానికి గురయ్యారన్నారు. పోలీసుల సమక్షంలో ఇలా జరగడం దారుణమన్నారు. కేసు పెట్టేందుకు వెళ్లిన పట్టాభి ఏమయ్యారనేది పోలీసులు చెప్పాలన్నారు. సీఎం జగన్‌ను బర్తరఫ్ చేసి, డీజీపీని సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొండ్రు మురళీ, ఎమ్మెల్యే వెలగపూడి, ఎమ్మెల్సీ డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,730
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,000
వెండి(కిలో):	రూ.71,700